క్లుప్తంగా...

నేడు మక్కా మసీదులో యౌముల్ ఖురాన్ సభ

శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో నాలుగో శుక్రవారం మజ్లిస్ పార్టీ (ఎంఐఎం) ఆధ్వర్యంలో జల్సా-ఇ-యౌముల్ ఖురాన్ సభను నిర్వహించనున్నట్లు మక్కా మసీదు నిర్వాహకులు తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా ఐదు శుక్రవారాల పాటు యౌముల్ ఖురాన్ సభ కొనసాగుతుందన్నారు. చివరి ఐదో శుక్రవారం ఈనెల 21న సైతం మజ్లిస్ పార్టీ (ఎంఐఎం) ఆధ్వర్యంలో యౌముల్ ఖురాన్ సభ ఉంటుందన్నారు.

జాబ్ మేళా విజయవంతం



జాబ్‌మేళాకు హాజరైన పలు కంపెనీల ప్రతినిధులతో ఉపాధి కల్పన శాఖ అధికారులు

నాంపల్లి: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో గురువారం నాంపల్లిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహించారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన మేళా మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. ఏడు కంపెనీలకు చెందిన పలువురు ప్రతినిధులు జాబ్ మేళాకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి మైత్రిప్రియ, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఎం.కస్తూరి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి జాబ్‌మేళాను సందర్శించారు.

'బ్యాగరి కులస్తుల సమస్యలపై పోరాడతా'



పేరోజి మహేశ్వర్

చాంద్రాయణగుట్ట: గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాల బ్యాగరి వృత్తిదారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నల్లవాగుకు చెందిన పేరోజి మహేశ్వర్ ఎన్నికయ్యారు. నగరంలో గురువారం జరిగిన బ్యాగరి కులస్తుల సమావేశంలో ఈ మేరకు సభ్యులు ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ శ్మశాన వాటికల అభివృద్ధితో పాటు బ్యాగరి కులస్తుల సమస్యలపై పోరాడుతానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన కులస్తులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

ఆకట్టుకుంటున్న బుర్జుఖలీఫా



గుడిమల్కాపూర్ కింగ్ ప్యాలెస్‌లో..

గోల్కొండ: గుడిమల్కాపూర్ కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బుర్జుఖలీఫా నమూ నా ఆకట్టుకుంటుంది. దుబాయ్‌లో ఉన్న బుర్జుఖలీఫా నమూనా దావత్-ఏ-రంజాన్ నిర్వాహకులు గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్‌లో ఏర్పాటు చేశారు. 3 రోజుల నుంచి గుడిమల్కాపూర్, కార్వాన్ తదితర ప్రాంతాలకు చెందిన కుటుంబాలతో వచ్చి దీనిని దర్శిస్తున్నారు. మరికొందరు సెల్ఫీలు దిగుతూ సంబరపడుతున్నారు.

ట్రా'ఫికర్'

గోల్కొండ: గోల్కొండ బంజార దర్వాజ వద్ద ప్రతినిత్యం ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు దర్వాజాకు రెండు వైపులా వందలాది వాహనాలు బారులు తీరి ఉంటున్నాయి. దర్వాజ ఇరుకుగా ఉండటం, కొంత కాలంగా గోల్కొండకు రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య పెరగడంతో బంజార దర్వాజ వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. పలుమార్లు అరగంట వరకు కూడా ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. ట్రాఫిక్ కానిస్టేబుల్ వాహనాల నియంత్రణకు ఉన్నా కూడా ఫలితం ఉండటం లేదు. సాయంత్రం వేళల్లో స్థానిక యువకులే వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. బంజార దర్వాజ నుంచి గోల్కొండ రిసాలబజార్, నయాఖిల్లా వెళ్లే వాహనాలను గోల్ఫ్ కోర్సు నుంచి మళ్లించాలని, అదే విధంగా రిసాలబజార్ నుంచి టోలిచౌకి వైపు వెళ్లే వాహనాలను సైతం జమాలి దర్వాజ గుండా గోల్ఫ్ కోర్సు నుంచి అనుమతి ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.



బంజార దర్వాజ వద్ద స్తంభించిన ట్రాఫిక్

దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు ఆదరణ

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తలసాని, దాసోజ శ్రవణ్, నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: తెలంగాణ తరహాలోనే దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు ఆదరణ లభిస్తుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం రాత్రి మంగళ్‌హాట్ డివిజన్ బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని ఆయన పేర్కొన్నారు. నగర బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ దాసోజి శ్రవణ్ మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనాలతో కార్యకర్తల్లో మరింత ఆత్మస్థైర్యం పెరిగిందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నంబర్-1 స్థాయిలో ఉందన్నారు. రాబోమే ఎన్నికల్లో బీజేపీని నామరూపాలు లేకుండా చేసి బీఆర్‌ఎస్ జెండా ఎగరవేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలకు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కార్యకర్తల్లో, నాయకుల్లో నూతన ఉత్తేజం వెల్లివిరుస్తుందన్నారు. అందరు కలిసికట్టుగా ఉండి బీజేపీని చిత్తుగా ఓడించడమే ప్రధాన ధ్యేయమన్నారు. నియోజకవర్గం నలుమూలల మురికివాడలు, బస్తీలలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ పథకాలను అందరికీ అందించి పార్టీ నంబర్-1 స్థాయిలో ఉండేవిధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు పూజవ్యాస్‌బిలాల్, ఆనంద్‌సింగ్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, పప్పు మాత్రే, ఆర్‌వీ.మహేందర్, ఆల పురుషోత్తమ్ రావు, సంతోష్‌గుప్తా, మనోహర్ గైక్వాడ్‌తో పాటు పెద్ద ఎత్తున దాదాపు వెయ్యిమందికి పైగా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అదే విధంగా నందకిశోర్‌వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగరవేశారు.



బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తున్న మంత్రి తలసాని, బీఆర్‌ఎస్ నాయకులు

'సంక్షేమ పథకాలతోనే బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుంది'

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే తిరిగి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ పలు సమస్యలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కరిస్తారన్నారు. ప్రభుత్వ పథకాలు గడపగడపకూ అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. బీజేపీను ఓడించేందుకు అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు.



మంత్రి తలసానికి సమస్యలను వివరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ సిక్వల్, గోవింద్ సిక్వల్, రిషబ్ సిక్వల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో పుస్తకావిష్కరణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గురువారం సాయంత్రం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సెంటర్ ఫర్ దళిత్ అండ్ ఆదివాసీ స్టడీస్ అండ్ ట్రాన్స్‌లేషన్ విభాగం, అంబేద్కర్ రీడింగ్ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌సీయూ విద్యార్థిని నమ్రతాసింగ్ రచించిన 'భోజ్‌పురి నవజాగరణ్ ఔర్ భికారీ ఠాకూర్' అలాగే 'సమ రాష్ట్ర ఝురి ఇన్ ది ల్యాండ్స్ ఆఫ్ కృష్ణా గోదావరి'ను ఆవిష్కరించారు. సమరాష్ట్ర మంచ్ జాతీయ కన్వీనర్ శ్యామ్‌ప్రసాద్, హెచ్‌సీయూ ప్రో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్‌ఎస్ సర్రాజు చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ థాట్స్ ఆన్ సోషల్ రిఫార్మ్స్ అండ్ జస్టిస్ అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సమరాష్ట్ర మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వంశీతిలక్, సీడీఏఎస్‌టీ ఇన్‌చార్జ్ హెడ్ ప్రొఫెసర్ అన్నపూర్ణ, ఏబీవీపీ అధ్యక్షురాలు నమ్రతాసింగ్, పలువురు పాల్గొన్నారు.



మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలి



పాఠశాలలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్

గోల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మౌలిక సదుపాయాలతో దాతలు ముందుకు రావడం అభినందనీయమని టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గుడిమల్కాపూర్ దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ జ్ఞాపకార్థం విద్యార్థుల కోసం నిర్మించిన తాగునీటి వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అయితే వాటర్ ట్యాంకులో ఎప్పటికప్పుడు శుభ్రపరిచే బాధ్యత కూడా నిర్వాహకులు తీసుకోవాలని ఆయన అన్నారు. వాటర్ ట్యాంకును శుభ్రపరచకపోవడం వల్ల అందులోని నీటిని తాగిన విద్యార్థులు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, కుల్సుంపుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, నాయకులు దేవర వంశీ, నామా యాదగిరి, శ్రీకాంత్ సాగర్, ప్రభు పూజారి, పవన్‌సింగ్ తదితరులున్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

సుల్తాన్‌బజార్: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని నైన్ స్టార్ గ్రూప్స్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ సుచరితారెడ్డి అన్నారు. గురువారం కోఠి సాయి మేధా కళాశాలలో డిప్లొమా చదువుతున్న పేద విద్యార్థులకు సుమారు 200 మందికి రూ.50 వేల విలువచేసే (స్టడీ మెటీరియల్) పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకొని పది మందికి ఉపాధి కల్పించే విధంగా తయారుకావాలని సూచించారు. ఇందుకోసం తమ ట్రస్ట్ నుంచి పేద విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్‌ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 50 మందిని ఉన్నత చదువుల కోసం విదేశాలకు తమ ట్రస్టు నుంచి పంపించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకులు ఆమెను అభినందించారు.



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న సుచరితారెడ్డి

ముగిసిన జాతీయ సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

చార్మినార్: ఈ యుగం ఇన్నోవేషన్ యుగమని.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆవిష్కరణలకు ఆస్కారం ఉందని ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యాశాఖ ప్రత్యేక అధికారి డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, అధ్యాపకులు మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకొని ఉపాధికి కావాల్సిన మెలకువలను అవలోకనం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఏఐ, ఎంఎల్, చాట్ జీపీటీతో భవిష్యత్తులో వర్తక వాణిజ్య రంగాల్లో పెను మార్పులకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. రెండు రోజుల సదస్సులో అధ్యాపకులు, పరిశోధకులు అనేక విలువైన పత్రాలను సమర్పించడం అభినందనీయమన్నారు. సదస్సు సంచాలకులు డాక్టర్ ఝాన్సీరాణిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆకుల రవి, డాక్టర్ జె.రత్న ప్రభాకర్, గజేంద్రబాబు, మల్లికార్జున్, శ్రీధర్, జయ కాగడా, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు



గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఇఫ్తార్ విందులు

గోల్కొండ: రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని చాటుతున్నాయి. నిజాం పాలకుల కాలం నుంచి ప్రారంభమైన ఈ ఇఫ్తార్ విందుల సంస్కృతి నానాటికి బలోపేతమవుతున్నది. గంగా-జమున-తహజీబ్‌ను ఈ ఇఫ్తార్ విందులు అద్దంపడుతున్నాయి. కేవలం తమ ఐక్యతను హిందూ-ముస్లిం మధ్య ఉన్న పటిష్ట బంధాన్ని తెలియజేయడానికే ఈ ఇఫ్తార్ విందుల ఆనవాయితీ ప్రారంభమైంది. స్థానికులు తమ బస్తీలలో ఇఫ్తార్ విందులు ప్రారంభించారు. కాగా నేడు ఇఫ్తార్ విందులు అన్ని వర్గాల ప్రజలు ఏర్పాటు చేస్తున్నారు. యువజన సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు, వ్యాపార సంఘాల వారితో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు సైతం పోటాపోటీగా ఈ ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని దశాబ్దాల నుంచి ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణ ప్రభుత్వం కూడా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నాయి. స్వయంగా ముఖ్యమంత్రితో పాటు మంత్రిమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, సామాన్య ప్రజలు సైతం ఇఫ్తార్ పార్టీలకు హాజరవుతున్నారు. 10 ఏళ్ల నుంచి యువ వ్యాపారులు ఫుల్ జోష్‌తో ఇఫ్తార్ విందులు నిర్వహిస్తున్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన



గుడిమల్కాపూర్‌లో బీజేపీ పతాకావిష్కరణ దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి కూపంలో కూరుకుపోయిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. గురువారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆయన బోజగుట్ట స్వామి వివేకానంద నగర్‌లో బీజేపీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రమంత్రుల అవినీతి బాగోతాలు రోజుకొక్కటి చొప్పున వెలుగు చూస్తున్నాయని అన్నారు. మరోవైపు లీకేజీల పరంపరా ఒకదానికొకటి వెనుక కొనసాగుతూనే ఉందని, లీకేజీల పాత్రదారులు, సూత్రదారులు రాష్ట్ర మంత్రులేనని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని సీఎం కేసీఆర్ గొప్పలు చెప్పుకుంటున్నారని, అయితే ఆ కుటుంబం ఒక్కటే అవినీతితో ఆర్థికంగా బలపడిందని ఆయన అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూడా బీఆర్‌ఎస్ మంత్రులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఓటర్లు చిత్తుగా ఓడించడం ఖాయమని ఆయన అన్నారు. స్వచ్ఛమైన పాలన అందించడం బీజేపీకే సాధ్యమని, ప్రధాని మోదీ పాలనను ప్రపంచ దేశాలు మెచ్చుకుంటున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, శేఖర్, నామా యాదగిరి, వెంకటప్ప తదితరులున్నారు.

అత్తాపూర్‌లో హెగ్డే ఫెర్టిలిటీ కేంద్రం ప్రారంభం

గోల్కొండ: సంతానం కోసం తపించే దంపతులకు సంతాన సాఫల్య కేంద్రాలు వరంలాంటివని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం పీవీఎన్ ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెం. 92 అత్తాపూర్ వద్ద హెగ్డే ఫెర్టిలిటీ కేంద్రాన్ని ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అత్యాధునిక వైద్యంతో సంతానం పొందేందుకు హెగ్డే సంతాన సాఫల్య కేంద్రం సంతానం లేని దంపతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. హెగ్డే ఫెర్టిలిటీ క్లీనికల్ డైరెక్టర్ డాక్టర్ వందనా హెగ్డే మాట్లాడుతూ.. 12 మంది సంతాన సాఫల్య నిపుణులతో ప్రత్యేక నిపుణుల బృందం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత, డాక్టర్ శాలినీ సింగ్, డాక్టర్ శాంత కుమారి తదితరులున్నారు.



హెగ్డే సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నేలకొరిగిన భారీ చెట్టు



పోస్టాఫీస్ వద్ద కూలిన చెట్టు

చార్మినార్: పాతబస్తీలో గురువారం సాయంత్రం గాలి, దుమారం, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. జోరుగా వీచిన గాలి దుమారానికి హైకోర్టు రోడ్డులోని పోస్టాఫీస్ వద్ద భారీ చెట్టు విరిగి నేలకొరిగింది. దీంతో అటు వైపు నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. స్పందించిన సంబంధిత అధికారులు రోడ్డుపై విరిగిపడిన కొమ్మలను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

అన్ని వర్గాలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

అబిడ్స్: అన్ని వర్గాలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. అభివృద్ధి, ప్రగతి నినాదమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ నినాదమన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను ఎమ్మెల్యే దానం నాగేందర్ సత్కరించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించి సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూజావ్యాస్ బిలాల్ తదితరులు పాల్గొన్నారు.



నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

డబీర్‌పురాలో జలమండలి అధికారుల పర్యటన



బస్తీల్లో పర్యటిస్తున్న జలమండలి అధికారులు

డబీర్‌పురా: డబీర్‌పురా డివిజన్‌లోని కోమటివాడి తదితర ప్రాంతాల్లో కొన్ని రోజులుగా తాగునీటి నల్లాలు, బోర్‌వేల్‌లలో కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో బుధవారం జలమండలి అధికారులు బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు బస్తీవాసులతో కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జలమండలి అధికారులు మాట్లాడుతూ.. అంతర్గత కేబుల్ వైర్ల తవ్వకాలతో కలుషిత నీటి సరఫరా జరుగుతుందన్నారు. దీనిని గుర్తించామని వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ రఘువీర్ ప్రసాద్, జలమండలి దారుషిఫా మేనేజర్ సయ్యద్ అబ్దుల్ జకీ, జాంబాగ్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ తరుణి, ఉద్యావన శాఖ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గోల్కొండ బడాబజార్ రోజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో 447 మంది షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాదీ ముబారక్ పథకం ద్వారా వచ్చిన డబ్బులను కేవలం అమ్మాయిల పెళ్లి కోసం వినియోగించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా ఎందరో నిరుపేదల ఇళ్లల్లో ఆడపిల్లల పెళ్లిల్లు జరిగాయన్నారు. అయితే సరైన పద్ధతిలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ చెక్కులు మంజూరు అయ్యాయని ఆయన అన్నారు. ఈ పథకం పట్ల నిరుపేదలకు సరైన అవగాహన లేదని, దీనివల్ల ఎందరో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని ఆయన అన్నారు. పెళ్లి ఈడు గల అమ్మాయిల తల్లిదండ్రులు నేరుగా తన వద్దకు వస్తే వారికి సలహాలు, సూచనలు ఇచ్చి వారి దరఖాస్తు చేసుకునేలా సహాయం చేస్తానని ఆయన అన్నారు. తన వద్దకు రాలేని వారు నేరుగా మండల తహసీల్ కార్యాలయానికి గానీ, కార్పొరేటర్‌లను కానీ కలిసి సహాయం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, నాయకులు వజీ ఉజ్‌జమా, బదర్ ఉద్దీన్, హబీబ్ చావూస్ తదితరులున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గౌలిపురా: నాలాలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సలాం చౌక్ రైల్వే ట్రాక్ సమీపంలోని ఓ నాలాలో ఈనెల 9న మధ్యాహ్నం 3 గంటలకు 50 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించిన మృతదేహన్ని వెలికితీసి స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

షేక్‌పేట్‌లో..



గోల్కొండ: షేక్‌పేట్ ద్వారకానగర్‌లోని హనుమాన్ ఆలయం మెట్లపై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం సృష్టించింది. గోల్కొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి హనుమాన్ ఆలయం మెట్లపై ఓ గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నాడని ఆలయ వాచ్‌మెన్ నరసింహ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మెట్లపై పడిఉన్న వ్యక్తిని కదిలించి చూశారు. అప్పటికే అతను మృతి చెందగా పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. గత కొంత కాలంగా యాచకుడైన మృతి చెందిన వ్యక్తి ఆలయ పరిసరాల్లోనే సంచరించే వాడని ఆలయ వాచ్‌మెన్ పోలీసులకు తెలిపాడు.

రంజాన్ కానుకల పంపిణీ



పంపిణీ చేస్తున్న మజ్లిస్ పార్టీ నాయకులు

సంతోష్‌నగర్: పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని హాఫీజ్‌బాబానగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రంజాన్ కానుకలను మజ్లిస్ పార్టీ నాయకులు సాబేర్ అలీ, రహమాన్‌ల ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.